క్లుప్తంగా

కంది విత్తనాల పంపిణీ



సి.బెళగల్‌లో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కంది విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. బుధవారం సి.బెళగల్ ఆర్‌బీకే- 2 పరిధిలో రైతులకు సర్పంచ్ పాండురంగన్న తదితరులతో కలిసి ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం సి.బెళగల్ ఆర్‌బీకే- 2కు మొదటి విడతలో భాగంగా రెండు టన్నుల ఎల్ఆర్‌జీ- 52 రకం కంది విత్తనం మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు బుధవారం ఆర్‌బీకే - 2 పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 45 మంది రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసినట్లు ఆర్‌బీకే ఇన్‌చార్జ్ హిమబిందు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్ నాయుడు, వీఆర్వో శేఖర్ ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: మండల పరిధిలోని సల్కాపురం సీతా రామాంజనేయుల దేవాలయం, లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాల నిర్మాణానికి బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు సర్పంచ్ మద్దిలేటి, ఎంపీపీ బోయ శారద, కార్పొరేటర్ లక్ష్మీకాంతారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ‘ఉపాధి’

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కూలీకి ఉపాధి పనులు చూపాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఏఈపీఓ రామేశ్వరమ్మ పేర్కొన్నారు. గుడిపాడులో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ప్రారంభమైతే ఉపాధి పనులకు కూలీల హాజరు తగ్గే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పనులు మొదలయ్యే వరకు, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు. వంకలు, నీటి కాలువలు, చెక్‌డ్యాంలలో చేపట్టిన పూడికతీత పనులను కూలీలతో పూర్తి చేయించాలన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించి రోజుకు వేతనం రూ.272 పడేలా చూడాలని సూచించారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు, ప్రార్థన మందిరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం పట్టణ సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులను పట్టుకుని ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఇప్పటివరకు మండలంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న దాదాపు 250 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రక్తదానంతో జీవన దానం

గూడూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలో పడమర బీసీ కాలనీలో బుధవారం కర్నూలు తలసీమియా పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తం సేకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు కిషోర్, దండు శ్రీను, ప్రవీణ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గూడూరు: మండల పరిషత్ కార్యాలయ ఏఓగా విజయసింహారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా ఉన్న వెంకటేశ్వ రెడ్డి ఎంపీడీఓగా పదోన్నతిపై అవుకు మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో జెడ్పీ అధికారులు విజయసింహా రెడ్డిని నియమించారు.

నాణ్యమైన ఎరువులు అందించండి

గడివేముల: మండలంలో రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని మండల వ్యవసాయాధికారి (ఏఓ)హేమసుందర్‌రెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకు మాత్రమే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. సీజన్ ప్రారంభంలో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు అందించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశు బీమా.. పాడి రైతుకు ధీమా

- ఒకసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల కాలపరిమితి
- 21 రోజుల్లోపే పరిహారం చెల్లింపు
- రైతులకు వరంలా పథకం

కోడుమూరు: పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు డాక్టర్ వైఎస్సార్ పశు బీమా వరంలా మారింది. గతంలో పిడుగుపాటుకు, భారీ వర్షాలు, విద్యుత్ షాక్, వ్యాధుల కారణంగా మూగజీవాలు మృతి చెందితే గత ప్రభుత్వం ఏడాదికో, రెండేళ్లకో నష్టపరిహారం మంజూరు చేసేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పశుబీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగపడుతోంది. రేషన్‌కార్డు కలిగిఉన్న పాడిరైతులు తమ వాటా కింద 20 శాతం, రేషన్‌కార్డు లేని వారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే వైఎస్సార్ పశు బీమా పథకానికి అర్హత పొందుతారు. ఒకసారి ప్రీమియం చెల్లిస్తే పశువులు, గేదేలకు మూడేళ్లు, గొర్రెలు, మేకలు, పందులకు ఏడాది నుంచి మూడేళ్లపాటు బీమా పథకం వర్తిస్తుంది. మూగజీవాలు మృతిచెందితే సంబంధిత పశు వైద్య అధికారులకు తెలియజేస్తే వారు పోస్టుమార్టం చేసి నివేదిక ఇస్తారు. ప్రీమియం చెల్లించిన రైతుకు 21 రోజుల్లోపు పరిహారం బ్యాంకు ఖాతాలో జమవుతుంది. కర్నూలు జిల్లాలో పశువులు 6,27,059, గేదెలు 91,874, గొర్రెలు 1,93,482, మేకలు 1,82,596 ఉన్నాయి.

పథకం ప్రయోజనం ఇలా

- పశుబీమా పథకంలో గరిష్ఠంగా ఓ కుటుంబానికి 5 గేదెలు లేదా 50 గొర్రెలు/మేకలకు బీమా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- ఆవు లేదా గేదెకు రూ.960 ప్రీమియం చెల్లించాల్సి ఉండగా రేషన్‌కార్డు కలిగివున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ.384 చెల్లిస్తే మూడేళ్లలోపు పశువు మరణిస్తే రూ.30 వేలు బీమా వర్తిస్తుంది.
- గొర్రె లేదా మేకలకు ప్రభుత్వ బీమా రూ.87 చెల్లించాల్సి ఉండగా రేషన్‌కార్డు కలిగిఉన్న రైతులు రూ.75 చెల్లిస్తే మూడేళ్లలోపు జీవాలు మరణిస్తే రూ.6 వేలు బీమా లభిస్తుంది.
- బీమా సొమ్ము చెల్లించిన రైతు వాటిని వేరే రైతుకు విక్రయిస్తే ఆ వివరాలను ఏడు రోజుల్లోపు స్థానిక రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలి. అలా జీవాలను కొనుగోలు చేసిన కొత్త రైతుకు బీమా సౌకర్యం వర్తిస్తుంది.
- బీమా పరిహారం పొందడానికి రైతు తమ పశువుకు ఇనాఫ్ ట్యాగ్ తప్పనిసరిగా వేయించుకోవాలి.
- పశు బీమా కోసం రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పశువుల వివరాలతో రైతు వాటా ప్రీమియం సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది.



పశు బీమా నమోదు చేయించి ఇనాఫ్ ట్యాగ్ చూపుతున్న పాడిరైతు

పశు బీమా రైతులకు వరం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ పశుబీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరం. గతంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా మూగజీవాలు చనిపోతే నష్టపరిహారం ప్రభుత్వం ఏడాదికో, రెండేళ్లకో చెల్లించేది. బీమా సౌకర్యంతో కేవలం 21 రోజులకే రైతుల ఖాతాలో డబ్బు జమయ్యే విధంగా ప్రవేశపెట్టిన ఈ పథకం రైతులకు ఎంతో ఉపయోగకరం. - **అబ్దుల్ కలాం, రైతు**

పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మూగజీవాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి. ప్రభుత్వం నిర్ణయించిన బీమా పరిహారం పొందాలంటే ట్యాగు తప్పనిసరిగా వేయించుకోవాలి. మూగజీవాలు మృతిచెందిన సందర్భంలో వెంటనే పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేయాలి. 21 రోజుల్లో బీమా పరిహారం రైతుల ఖాతాలో జమవుతుంది.

– **రామసుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీప**

బీమా మొత్తం (ఆవు/గేదె)	లబ్ధిదారుని వాటా బీపీఎల్/ఎస్సీ/ఎస్టీ	ఏపీఎల్	వ్యవధి (సంవత్సరాలు)
రూ.30వేలు	రూ.384	రూ.960	3
రూ.15వేలు	రూ.192	రూ.480	3
గొర్రె లేదా మేకలకు			
రూ.6వేలు	రూ.36	రూ.90	1
రూ.6వేలు	రూ.54	రూ.135	2
రూ.6వేలు	రూ.75	రూ.187.5	3

‘పది’ సప్లిమెంటరీ పరీక్షకు 47 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 47 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు తెలిపారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల, మోడల్ స్కూళ్లలో పది సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. నాల్గవ రోజు మంగళవారం గణిత పరీక్షకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 146 మందికి గాను 128 మంది, మోడల్ స్కూల్లో 152 మంది విద్యార్థులకు గాను 123 మంది హాజరైనట్లు ఆయా పాఠశాలల పరీక్ష నిర్వహణ అధికారులు హెచ్ఎం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు.

ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలి

గూడూరు రూరల్: గ్రామ పంచాయతీల్లోని కార్మికులు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలను తరలించాలని ఈఓఆర్‌డీ నాగమ్మ సూచించారు. పెంచికలపాడులోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ప్రజల నివాసాల వద్దకు వెళ్లి పొడి, తడి చెత్తను సేకరించి షెడ్డుకు తరలించాలన్నారు. రోడ్లపై, డ్రైనేజీలో చెత్త లేకుండా చూసుకోవాలన్నారు. చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు సబ్సిడీపై విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం పెంపునకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



గోరంట్లలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం 180వ రోజుగా గోరంట్ల గ్రామంలో సర్పంచ్ బాలకృష్ణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. కొళాయిలకు నీరు సక్రమంగా రావడం లేదని, పింఛన్లు, ఇళ్లు మంజూరు కావడం లేదంటూ కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలంటూ తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏపీఓ రమాదేవి, స్థానిక నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, బాలు, నాయుడు, మనోహర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సి.బెళగల్‌లో మండల అధికారులతో సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలలో పురోగతి సాధించాలని, లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల హెచ్చరించారు. ఆమె బుధవారం మండల అధికారులతో కలసి కొండాపురం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు, హౌసింగ్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి నిర్మాణాలలో పురోగతి సాధించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయంను తనిఖీ చేసి రికార్డులు, ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాల అమలుతీరు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని, వలంటీర్ల సేవలు మెరుగుపడాలని సూచించారు. అనంతరం గృహ నిర్మాణ లబ్ధిదారులు, అధికారులు, ఉద్యోగులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేశారు.

సచివాలయాలపై పర్యవేక్షణ పెంచండి

గ్రామ సచివాలయాల పనితీరు మెరుగు పడేందుకు మండల అధికారులు పర్యవేక్షణ పెంచాలని ప్రత్యేకాధికారిణి శ్యామల సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలు, విద్య, తాగునీరు, సచివాలయాల పనితీరు, ఉద్యోగుల విధుల తదితర అంశాలపై మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, స్పందన ఫిర్యాదులు అర్జీదారుడు సంతృప్తి పొందేలా పరిష్కారం చూపాలన్నారు. తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు, హౌసింగ్ ఏఈ సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీగా పనిచేయండి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్

కర్నూలు (న్యూటౌన్): గ్రామ పంచాయతీ కార్యదర్శులందరూ జవాబుదారీతనంతో పనిచేయాలని కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్ సూచించారు. బుధవారం జెడ్పీలోని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి నెలా 2, 17 తేదీల్లో ఆయా గ్రామాల్లోని ఓహెచ్ఆర్‌సీ ట్యాంకులను శుభ్రం చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. ‘స్పందన’ సమస్యలకు సత్వరం పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏఓ భాస్కర్‌నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘గోరుకల్లు’ మరమ్మతు పనులు ప్రారంభం



పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న ఇంజినీర్లు

పాణ్యం: గోరుకల్లు జలాశయం కట్ట కుంగిన చోట మరమ్మతు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. కుంగిన కట్టకు చేపట్టాల్సిన మరమ్మతుల ప్రణాళికను కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పరిశీలించారు. పనులు చేపట్టేందుకు అవసరమైన ముడి సరుకును సిద్ధంగా ఉంచారు. ఇటీవల గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోవడంతో ఇంజినీర్లు సమస్యను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి తెలియజేశారు. ఆయన సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జల వనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు పనులు ప్రారంభించారు. భారీ యంత్రాల సాయంతో కట్టపైకి సామగ్రి తరలిస్తున్నారు. అలాగే ‘ఫాల్ట్‌జోన్’ ప్రదేశంలో జారిపడిన రాళ్లను పూర్తిగా తొలగించి బేస్ లెవల్ పటిష్టం చేసి ఆ తర్వాత రాళ్లను పిచ్చింగ్ చేయనున్నారు. పనులపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఇంజనీర్లతో చర్చిస్తున్నారు. మరోమారు ఇలాంటి సమస్య రాకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సూచించారు. ఈ నెల 6వ తేదీన ఎమ్మెల్యే పరిశీలించి వెళ్లిన మరుసటి రోజే మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభం కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

నీట మునిగి వృద్ధురాలు మృతి



మృతిచెందిన సాలమ్మ

ఓర్వకల్లు: మండల సమీపంలోని కుందూ వాగు వంతెన కింద వృద్ధురాలు బుధవారం ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మృతురాలు వెల్దుర్తి మండలం పుల్లగుమ్మికి చెందిన వడ్డె సాలమ్మగా గుర్తించామన్నారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

రైతు ఆత్మహత్య



తెలుగు నాగరాజు (ఫైల్)

గూడూరు: పట్టణానికి చెందిన తెలుగు నాగరాజు (54) అనే రైతు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు తెలుగు నాగరాజు 3 ఎకరాల సొంత పొలంతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. దిగుబడులు సరిగా రాక చేసిన అప్పులకు రూ.8 లక్షలకు చేరాయి. అప్పుల బాధ తాళలేక తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మహేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ విక్టర్‌బాబు పేర్కొన్నారు.

కడుపునొప్పి తాళలేక బలవన్మరణం

కోడుమూరు రూరల్: మండలంలోని అల్లినగరం గ్రామంలో కడుపునొప్పి తాళలేక గోరంట్ల మాదన్న (55) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. అల్లినగరం గ్రామానికి చెందిన గోరంట్ల మాదన్న తీవ్రమైన కడుపునొప్పి భరించలేక మంగళవారం సాయంత్రం పురుగు మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం తెలవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మాదన్నకు భార్య వెంకటేశ్వరమ్మతో పాటు, ఇద్దరు కుమారులు సంతానం.

అర్హతే ప్రామాణికం.. పేదలకు అందలం



సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఓర్వకల్లులో బుధవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మండల స్థాయి అధికారుల బృందంతో కలిసి స్థానిక మూడవ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 33వ వార్డు పాత కల్లూరులో స్థానిక కార్పొరేటర్ నరసింహులు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లు సైనికుల్లా పనిచేయాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక పొదుపు భవనంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి నిర్మూలనకు నాంది పలికారని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పారదర్శకంగా సేవలందించాలన్నారు. అనంతరం వలంటీర్లను సేవా మిత్ర, సేవా రత్న అవార్డులతో సత్కరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. ఆయన బుధవారం గడివేములలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను వీధుల్లో పడేయకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని సోమాపురం గ్రామానికి చెందిన కడమంచి సునీత ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్త, మామపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన సునీతను బిలకలగూడూరు గ్రామానికి చెందిన రాజుకు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేశారు. గత కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్త ఉసేనమ్మ, మామ లాలప్పపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జేవీకే కిట్లు అందజేత

కల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం ఎంఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అనంతరం సల్కాపురం ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు–నేడు పనులను ఆయన పరిశీలించి సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

‘ఉపాధి’ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలకపాత్ర అని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డ్వామా పీడీ హాజరై మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో కోరిన వారికి పనులు కల్పించి, నిజాయితీగా పని చేస్తూ చురుకైన పాత్ర పోషిస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహించి పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న 100 శాతం సబ్సిడీపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శిక్షణా తరగతులకు కృష్ణమోహన్, బ్రహ్మానందరెడ్డి, నరసింహులు, నందకిశోర్ శిక్షకులుగా వ్యవహరించారు. ఓర్వకల్లు, కర్నూలు, కృష్ణగిరి, వెల్దుర్తి, కల్లూరు, కోడుమూరు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఉపాధి కూలీలు గరిష్ఠ వేతనం రోజుకు రూ.272 పొందేలా పనులు చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుట్టపాడు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కాల్వబుగ్గ వద్ద ఉన్న నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్ సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

యువత.. ఈత సరదా



గార్గేయపురం చెరువులో ఈత కొడుతున్న యువకులు

కర్నూలు (న్యూటౌన్): మండుతున్న ఎండలతో ఉష్ణ తాపం నుంచి ఉపశమనం పొందుందుకు పల్లెల్లోని యువత వ్యవసాయ బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు మండలం గార్గేయపురం చెరువు నిత్యం ఈత కొట్టే యువకులతో కళకళలాడుతోంది. చల్లటి నీళ్లలో ఈత కొడితే ఎంత హాయిగా ఉంటుందనిపించేలా యువత జలకాలాటలలో మునిగితేలుతున్నారు. మరికొందరు తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఈత నేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ చెరువు కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో ఆ మార్గంలో వెళ్లేవారు తమ వాహనాలను నిలుపుకుని సుందర దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు. వేసవిలో ఒక్కసారైనా ఈ చెరువులో ఈత కొడదామా అన్నట్లు ప్రయాణికులు చెరువువైపు చూస్తూ వెళుతున్నారు.